క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు టౌన్: రోడ్డు విస్తరణ పనుల కారణంగా నేడు (ఆదివారం) తాండూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ విద్యుత్ ఏఈ రఘు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరా చౌక్ నుంచి శివాజీ చౌక్, సీసీఐ కాలనీ, హమాలీ బస్తీ, గౌతాపూర్ రోడ్డు, వాల్మీకి నగర్, గాంధీనగర్, గొల్లచెరువు, బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ప్రజావాణి

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని కొడంగల్, పాత కొడంగల్, కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాల ప్రజలు వారి సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరిష్కారానికి అనుకూలంగా ఉన్న వాటికి అక్కడికక్కడే ఆమోదం లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు.

రూ.5 లక్షలతో సీసీరోడ్డు



బుద్దారంలో జరుగుతున్న సీసీరోడ్డు పనులు

పెద్దేముల్: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని బుద్దారం సర్పంచ్ రేగొండి లక్ష్మి అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామంలో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అన్ని వార్డుల్లో సీసీతో పాటు మురుగుకాల్వలు నిర్మిస్తామని చెప్పారు. రూ.5 లక్షతో హరిజన వాడలో 125 మీటర్ల సీసీరోడ్డు వేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థులు

బంట్వారం: శిక్షణ ఫౌండేషన్ మైండ్‌ట్రీ ఆధ్వర్యంలో శనివారం కోట్‌పల్లి ఎంఆర్‌సీ భవనంలో 6,7 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 2023 ప్రేరణ పురస్కారాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని 8 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కేజీబీవీ బంట్వారం విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకోగా.. జెడ్పీహెచ్‌ఎస్ కోట్‌పల్లి విద్యార్థులు ద్వితీయ బహుమతి పొందారు. విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చదనం.. అగ్నికి ఆహుతి



ఎస్‌ఏపీ కళాశాల వద్ద కాలిపోయిన మొక్కలు

వికారాబాద్ అర్బన్: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నాయి. బాటసారులు, పశువుల కాపరుల నిర్లక్ష్యంతో పచ్చటి మొక్కలు కాలిపోతున్నాయి. ప్రమాదవశాత్తో, లేక ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లనో కాని.. అడికాస్త విస్తరించి పోతోంది. వారం రోజుల క్రితం మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి వద్ద రోడ్డు పక్కన నాటిన మొక్కలు పెద్ద ఎత్తున కాలిపోయాయి. మొక్కలు ఆహుతి కావడాన్ని పరిశీలించిన మున్సిపల్ అధికారులు కాలిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం మున్సిపల్ పరిధిలోని ఎస్‌ఏపీ కళాశాల సమీపంలో కూడా రోడ్డు పక్కన మంటల వ్యాపించి మొక్కలు పూర్తిగా కాలిపోయాయి. మొక్కలు ఎదిగే సమయంలో నిప్పంటుకోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఎవరు కూడా రోడ్డు పక్కన నిప్పు పారవేయొద్దని మున్సిపల్ అధికారులు కోరుతున్నారు.

పంట నమోదులో రైతులు సహకరించాలి

మోమిన్‌పేట: పంటల నమోదులో రైతులు అధికారులకు సహకరించాలని రాష్ట్ర అర్థ గణాంక శాఖ సంచాలకులు దయానందం చెప్పారు. శనివారం మండల పరిధిలోని టేకులపల్లిలో ఏరియా ఎన్యూమరేషన్ సర్వే సీటీఓ యాప్ పంటల నమోదు, సాగు విస్తీర్ణ గణనను పరిశీలించి మాట్లాడారు. రైతులు పంటల సాగు నమోదులో అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నిరంజన్‌రావు అర్థ గణాంక శాఖ సహాయ సంచాలకులు మహబూబ్‌అలీ, వెంకటరమణ, రంగారావు ఉన్నారు.

'మనఊరు.. మనబడి'



నర్సాపూర్ ప్రాథమిక పాఠశాల

సర్కారు బడి అంటే.. అంతగా ఆసక్తి చూపని తల్లిదండ్రులు, విద్యార్థులు నేడు ఉత్సాహం చూపుతున్నారు. 'చదివిస్తే మా బిడ్డను ప్రభుత్వ పాఠశాలలో సదివించాలే' అనే విధంగా అటు ప్రభుత్వం.. ఇటు ఉపాధ్యాయ బృందం శ్రమిస్తోంది. బడుల బలోపేతానికి అనేక నిధులు వెచ్చిస్తూ సర్కారు ప్రోత్సహిస్తుండగా.. తమవంతు బాధ్యతగా టీచర్లు.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ.. మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తున్నారు.

- సర్కారు స్కూళ్లకు మౌలిక సదుపాయాలు
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- రూ.20.95లక్షలతో మారిన నర్సాపూర్ బడి రూపురేఖలు

దౌల్తాబాద్: బడుల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మనఊరు–మనబడి పథకాన్ని తీసుకువచ్చింది. దీని అమలు ద్వారా సర్కారు బడుల రూపురేఖలు మారుతున్నాయి. విద్యార్థుల కోసం అన్ని వసతులు కల్పిస్తోంది. మనఊరు–మనబడిలో తొలివిడతగా మండలంలో 24 పాఠశాలలు ఎంపిక కాగా.. నర్సాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో పనులు పూర్తయి ఇటీవల ప్రారంభమయింది. ఈ బడికి రూ.14.95లక్షలు మంజూరయ్యాయి. వీటితో విద్యుత్, తాగునీరు పనులు చేశారు. రూ.6 లక్షలు ఈజీఎస్ నిధులతో మరుగుదొడ్లు, వంటగదులు నిర్మించారు. ప్రస్తుతం పాఠశాలలో 32 బాలురు, 19 మంది బాలికలు ఉన్నారు. విద్యార్థుల కోసం హ్యాండ్‌వాష్, తాగునీటి కోసం నల్లాలు ఏర్పాటు చేశారు. చదువుకోడానికి డ్యూయల్ డెస్క్ బెంచీలు, బ్లాక్‌బోర్డు స్థానంలో గ్రీన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. అన్ని గదుల్లో పూర్తిస్థాయిలో లైటింగ్, ఫ్యాన్లు అమర్చారు. టీచర్స్, హెడ్‌మాస్టర్ ఫర్నీచర్ తెచ్చారు. తరగతి గదుల ముందు భాగంలో నూతనంగా టైల్స్ వేసి రేలింగ్ ఏర్పాటు చేశారు. భవనానికి మరమ్మతు చేపట్టి, రంగులు వేయడంతో కొత్త రూపును సంతరించుకుంది.

విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం..

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పిస్తుండడంతో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఒకప్పుడు అత్యధిక డ్రాపౌట్స్ ఉన్న పాఠశాలలో మండలంలో ప్రథమ స్థానంలో ఉండే విధంగా పాఠశాలను ఉపాధ్యాయులు తీర్చిదిద్దారు. నాడు విద్యార్థుల సంఖ్య తగ్గి మూతపడే పాఠశాలలో.. విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేశారు. ఈ పాఠశాలలో 1నుంచి 5వతరగతి వరకు 51 మంది విద్యార్థులు చదువుతున్నారు.

డెస్క్ బెంచీలు బాగున్నాయి



పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన డెస్క్ బెంచీలు చాలా బాగున్నాయి. ఎంతో సౌకర్యవంతంగా కూర్చొని చదువుకోగలుగుతున్నాము. పాఠశాలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. హ్యాండ్‌వాష్ తదితర సౌకర్యాలు కల్పించారు.

– అశ్విని, 4వ తరగతి

అందంగా తీర్చిదిద్దారు



మా పాఠశాలకు అన్ని సౌకర్యాలు వచ్చాయి. తరగతి గదుల్లో కొత్తగా ఫ్లోరింగ్ గదుల్లో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి నల్లాలు ఏర్పాటు చేశారు. చాలా అందంగా తీర్చిదిద్దారు. ప్రైవేటు పాఠశాలల్లో కూడా ఇలాంటి సౌకర్యాలు ఉండవేమో.

– సింధు, 2వ తరగతి

కొత్త రూపు తీసుకువచ్చాం



మనఊరు–మనబడి నిధులతో పాఠశాలకు కొత్త రూపు తీసుకువచ్చాం. ఇప్పుడు పాఠశాల కార్పొరేట్‌కు ఏ మాత్రం తీసిపోని విధంగా తయారైంది. పాఠశాల కమిటీ, సర్పంచ్, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల అభివృద్ధి చెందుతోంది.

– రాఘవేంద్రప్రసాద్, హెచ్‌ఎం, నర్సాపూర్

హరితం.. ఓ ప్రయత్నం

సిమెంట్ రింగుల్లో మొక్కల పెంపకం

వికారాబాద్ అర్బన్: హరితహారంలో భాగంగా గుంతలు తీసి మొక్కలు నాటడం చూశాం. కానీ వికారాబాద్ అటవీశాఖ అధికారులు కొంత వినూత్నంగా ప్రయత్నించారు. అనంతగిరి వెళ్లే ప్రధాన రోడ్డుకు కుడి వైపు అడవిలో కొంత దూరం పూర్తిగా రాయి మాత్రమే ఉంది. ఆ ప్రాంతంలో భూమిలో గుంత తీసి మొక్కలు నాటే పరిస్థితి లేదు. దీంతో అటవీశాఖ అధికారులు కొత్త ప్రయత్నం చేశారు. సిమెంట్ రింగులను వేసి అందులో వేప, రాగి, అల్లనేరడు వంటి మొక్కలను పెంచుతున్నారు. మరోచోట నల్లరాయిని రెండు వైపులా పేర్చి మధ్యలో మట్టి పోసి మొక్కలు పెంచుతున్నారు. చూడటానికి అది చాలా అందంగా కనిపిస్తున్నాయి. ఈ మొక్కల పెంపకం పర్యాటకులకు కొంత వింతగా అనిపించడంతో కొద్దిసేపు చూసి సరదాగా గడుపుతున్నారు. ఈ రకంగా పెంచుతున్న మొక్కలు పర్యాటకులకు ఫొటో షూట్‌కు కూడా పనిచేస్తోంది.



సిమెంట్ కుండీల్లో మట్టి పోసి మొక్కలు పెంచుతున్న అటవీశాఖ

'పోరాడే వారికే ప్రాధాన్యతివ్వండి'



మోడల్ పాఠశాలలో ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ నేతలు

కుల్కచర్ల: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ టీఎస్ సంఘం ఎంతో కృషి చేస్తుందని సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కుల్కచర్ల, ముజాహిద్‌పూర్ గ్రామాల్లోని పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలకై పోరాడే సంఘానికి ప్రాతినిథ్యం వహిస్తున్న అభ్యర్థులకే ఉపాధ్యాయులు మద్దతు తెలపాలని కోరారు. పీఆర్టీయూ టీఎస్ సంఘం తరపున పోటీలో ఉన్న గుర్రం చెన్నకేశవ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, సంఘం నేతలు నర్సింహులు, శీనయ్య, శేఖర్, వెంకటయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, స్థానిక ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కుటుంబపాలన

- మాయమాటలతో మోసం చేస్తున్న కేసీఆర్
- కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం
- మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

అనంతగిరి: రాష్ట్రంలో కుటుంబపాలన కొనసాగుతోందని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. శనివారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మండలంలోని రాళ్ల చిట్టంపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి.. కాంగ్రెస్ పాలన, పథకాలు, రైతు డిక్లరేషన్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తానని రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన కేసీఆర్.. ఇచ్చిన వాగ్దానాలు మరిచారని మండిపడ్డారు. మాయమాటలతో ఇప్పటికే రెండుసార్లు మోసపోయిన ప్రజలు ఇపుడు మోసపోవడానికి సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, ఎకరానికి రూ.15వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అసైన్డ్ భూములపై అన్ని హక్కులు కల్పిస్తామని చెప్పారు. రైతులు ధరణితో ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేస్తామని చెప్పారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అన్ని వర్గాలకు న్యాయం జరిగేది హస్తంతోనేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మహిపాల్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్

- నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి
- 'జియో' హాజరు తప్పనిసరి
- మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలోని విభాగాల అధిపతులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర చెప్పారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను బతికించాలని, ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు కార్యాలయంలో సమయపాలన పాటించాలని, జియో యాప్ ద్వారా హాజరు నమోదు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి అర్జి దారుని వివరాలు విభాగం వారీగా నమోదు చేయాలని సూచించారు. శానిటేషన్, నీటి సరఫరా గురించి సంబంధిత సిబ్బందితో పని విభజన యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. నీటి సరఫరాలో లీకేజీని ఎప్పటికప్పుడు సరిచేయాలని తెలిపారు. కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

పేదలపై ఆర్థిక భారం మోపిన కేంద్రం

- దేశంలో పెరుగుతున్న నిరుద్యోగులు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



ప్లీనరీలో మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు అన్యాయం చేసేలా.. బడా బాబులకు లాభం చేకూరేలా పనిచేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, వెంకటరాములు ఆరోపించారు. శనివారం వికారాబాద్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్లీనరీలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. దేశాన్ని ఆర్థికంగా కుదేలు చేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. వంటగ్యాస్ ధరలు పెంచి పేదలపై ఆర్థిక భారం మోపిన కేంద్రం.. బడా వ్యాపారులకు మాత్రం రాయితీలు ఇస్తుందని మండిపడ్డారు. పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసే విధంగా తెలంగాణలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. వికారాబాద్ జిల్లాకు ఈ నెల 26న యాత్ర చేరుకుంటుందని, ప్రజానికాన్ని పెద్ద ఎత్తున సమీకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య, కార్యదర్శి మల్లేశం, శ్రీనివాస్, చంద్రయ్య, మైపాల్, రామకృష్ణ, బుగ్గప్ప, సుభాష్, సుదర్శన్, సతీష్, రవి, అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ సంగీత

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తాండూరు టౌన్: తాండూరు పట్టణం గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన మంజుశ్రీపై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక కౌన్సిలర్ సంగీతాఠాకూర్ కలెక్టర్ నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎనిమిదేళ్లుగా పాఠశాలకు విడుదలవుతున్న నిధులను దుర్వినియోగం చేసిందని ఆమె ఆరోపించారు. గతంలో ఆమె విద్యార్థులతో మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్ శుభ్రం చేయించినందుకు డీఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో జనవరి 12న ఆమెను పట్టణంలోని సాయిపూర్ పాఠశాలకు ఓరల్ డిప్యుటేషన్‌పై పంపించారు. అయితే జనవరి 27న తప్పుడు బిల్లులు పెట్టి గాంధీనగర్ పాఠశాల నిధులను డ్రా చేసుకుందని ఆమె చెప్పారు. పనిచేసిన 8 ఏళ్ల కాలంలో పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని, 120 మంది విద్యార్థులతో ఉన్న పాఠశాల.. ప్రస్తుతం 40 మందికి చేరిందని వాపోయారు. కావున ఆమెపై తక్షణమే విచారణ జరిపించాలని కౌన్సిలర్ వినతిపత్రంలో కలెక్టర్‌ను కోరారు.

'మనబడి' పనులు ప్రారంభం

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామంలో మనఊరు–మనబడి పనులు ప్రారంభమయ్యాయి. శనివారం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ నాగర్జున పనులు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మనఊరు–మనబడి పథకం కింద రూ.14 లక్షలు మంజూరు చేసిందని, నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

పూడూరు: సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు పొందాలని తాండూరు డాట్ సెంటర్ అధికారి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కండ్లపల్లిలో వివిధ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అక్బర్‌ఖాన్ అనే రైతు జొన్న పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన సూచనలు చేశారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, ఏఈఓలు ఇలియాస్, రాంబాబు, నాయకులు సదానందంగౌడ్, వెంకటయ్య, బాలయ్య పాల్గొన్నారు.

పాడైన రోడ్డునే నిర్మిస్తున్నాం

దౌల్తాబాద్: మిషన్‌భగీరథ పనులతో గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిన రోడ్డునే నిర్మిస్తున్నామని నందారం బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జనార్దన్‌రెడ్డి చెప్పారు. గ్రామంలో వేసిన రోడ్డుపై సీసీరోడ్డు నిర్మిస్తున్నారంటూ మాజీ సర్పంచ్ ఆరోపణలు చేయడంపై వారు స్పందించారు. గ్రామంలోకి వెళ్లడానికి ప్రధానరోడ్డు ఇదేనని, మిషన్‌భగీరథ పనులతో పాడైందని, పంచాయతీ తీర్మానంతో ఉపాధి నిధులతో రోడ్డు వేస్తే ఆరోపణలు చేయడం సరైంది కాదని హితవు పలికారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

కొడంగల్ రూరల్: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఉష అన్నారు. పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన స్వయం పరిపాలనా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రమశిక్షణ, లక్ష్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాములు, విద్యార్థుల తల్లిదండ్రులు, సీపీఎస్ బాలుర హెచ్‌ఎం కృష్ణయ్య, చిట్లపల్లి తండా హెచ్‌ఎం దినేష్‌సింగ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశాలు నిర్వహించాలి

- ప్రజా సమస్యలకు పరిష్కారం చూపండి
- కలెక్టర్‌కు విన్నవించిన బీజేపీ కౌన్సిలర్లు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కౌన్సిలర్లు

తాండూరు టౌన్: తాండూరు పట్టణ మున్సిపల్ సమావేశాలు సక్రమంగా నిర్వహించేలా చూడాలని కలెక్టర్ నారాయణ రెడ్డికి శనివారం బీజేపీ కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి 37 నెలలు కాగా, కనీసం 34 సమావేశాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కానీ నామమాత్రంగా కేవలం 10 సమావేశాలు మాత్రమే నిర్వహించి, సమస్యల పరిష్కారాన్ని జాప్యం చేశారని ఆరోపించారు. వెంటనే సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. అలాగే గతంలో జరిగిన సమావేశాల్లోనూ, తాజా సమావేశాల్లో కౌన్సిల్‌చే ఆమోదం పొందిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ లలిత, కౌన్సిలర్లు శ్రీలత, లావణ్య, పూజ, బాలప్పలు వినతి పత్రంలో పేర్కొన్నారు.

'ఆలయ అభివృద్ధికి కట్టుబడున్నాం'

కుల్కచర్ల: నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తమ అభిమతమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శనివారం చౌడాపూర్ మండలం మరికల్–కిష్టంపల్లి గ్రామ పరిధిలోని కోటచింతల బసవేశ్వర స్వామి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బసవేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఆధ్యాత్మిక కార్యక్రమాల వలన గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మరికల్ సర్పంచ్ పాండురంగయ్య, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల యూత్ వింగ్ అధ్యక్షుడు మేగ్యా నాయక్, నాయకులు రాజప్ప, మఠం రాజశేఖర్ లక్ష్మయ్య స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

అతివలు అన్ని రంగాల్లో రాణించాలి



నవాబుపేట: మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరమ్మ

నవాబుపేట: కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరమ్మ అన్నారు. మండల పరిధిలోని మమ్మదాన్‌పల్లి గ్రామంలో శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు పోటీపడాలని, మహిళలకు ఉన్న హక్కులు, విధులను తెలుసుకొని ముందుకు సాగాలని సూచించారు. వారం రోజుల పాటు మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, సబ్ సెంటర్ వైద్యురాలు సారనోజ్, సూపర్ వైజర్ శాలిని, పంచాయతీ కార్యదర్శి నితిన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఏఎన్‌ఎంలు పుష్ప, సుశీల తదితరులు పాల్గొన్నారు.

మరింత అవగాహన కల్పించాలి: జడ్జి



పరిగి: మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న జడ్జి హరికుమార్

పరిగి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హరికుమార్ అన్నారు. మండల న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో పరిగి కోర్టులో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మట్లాడుతూ రాజ్యాంగం మహిళలకు ప్రత్యేక హక్కులను కల్పిస్తుందని చెప్పారు. గతంలో వంటింటికే పరిమితం అయిన వారు.. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగారని తెలిపారు. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా మహిళలు వంటింటికే పరిమితం అయ్యారని, వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.